క్లుప్తంగా

మండల సమావేశం వాయిదా

రాజవొమ్మంగి: మండల ప్రజాపరిషత్ సర్వ సభ్య సమావేశం ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా బుధవారం రద్దు అయింది. ముందుగా ప్రకటించిన మేరకు ఈ సమావేశానికి ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి, సర్పంచ్, ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ మధ్యాహ్నం రెండు గంటలకు హాజరయ్యారు. కాగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా సమావేశం వాయిదా వేసినట్టు ఏఓ రత్నరాజు ప్రకటించడంతో అందరూ వెనుతిరిగారు. అయితే సమావేశానికి వచ్చినవారు సంబంధిత రిజిస్టర్‌లో సంతకాలు చేశారు.

ఆత్మీయ వీడ్కోలు



బదిలీపై వెళ్తున్న వారిని సన్మానిస్తున్న సర్పంచ్ వెంకటరావు, తదితరులు

డుంబ్రిగుడ: మండంలోని పోతంగి గ్రామ సచివాలయం పరిధిలో పనిచేస్తున్న వీఆర్‌వో ఝాన్సీలక్ష్మి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, లైన్‌మెన్ నిరంజన్‌ల బదిలీ సందర్భంగా గ్రామ సచివాలయం సిబ్బంది బుధవారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ వెంకటరావు, ఇతర అధికారులతో కలిసి వారికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. వీఆర్‌వో ఝాన్సీలక్ష్మి అరకులోయ మండలం కొత్తభల్లుగుడకు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ శ్రీనివాసరావు తూటంగి సచివాలయానికి, లైన్‌మెన్ నిరంజన్ గసభ పంచాయతీకి బదిలీ అయినట్టు వారు తెలిపారు. సచివాలయం సిబ్బంది లక్ష్మణ్, నాగేంద్ర, ప్రసాద్, కిరణ్, మాధురి, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

88 మందికి కంటి పరీక్షలు



శిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

పెదబయలు: జిల్లా అంధత్వ నివారణ సంస్థ తలపెట్టిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన వచ్చినట్టు పెదబయలు, గోమంగి పీహెచ్‌సీ వైద్యాధికారులు నిఖిల్, కిరణ్ కుమార్ చెప్పారు. పెదబయలు, గోమంగి పీహెచ్‌సీల్లో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఆయా పీహెచ్‌సీల్లో నిర్వహించిన శిబిరానికి 88 మంది రోగులు వచ్చారని, వారిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేసినట్టు వైద్యాధికారులు నిఖిల్, కిరణ్‌కుమార్ చెప్పారు. ఇందులో 8 మందిని శస్త్ర చికిత్సల నిమిత్తం ప్రత్యేక బస్సులో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్‌కు తరలించామన్నారు. కంటి సమస్యలుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. శంకర్ ఫౌండేషన్‌కు చెందిన వైద్య నిపుణులు, పీహెచ్‌సీల సిబ్బంది తదితరులు వైద్య సేవలందించారు.

ఘనంగా అమ్మవారి ఉత్సవం

కొయ్యూరు : మండలంలోని సింగవరంలో మరిడమ్మ తల్లి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ నిర్వాహకుడు మువ్వలరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భారీ ఊరేగింపు నడుమ భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చినట్టు నిర్వాహకులు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



భక్తులకు మాలధారణ చేయిస్తున్న వెంకటరామయ్య

అడ్డతీగల: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య అన్నారు. రెండవ విడత సత్య దీక్షల స్వీకరణ కార్యక్రమం బుధవారం అడ్డతీగలలోని పవనగిరి క్షేత్రంలో జరిగింది. ఏజెన్సీలోని 11 మండలాల నుంచి 271 మంది భక్తులు మాలధారణ స్వీకరించినట్టు ఆయన చెప్పారు. సత్య దీక్ష వస్త్రాలు ధరించిన భక్తులకు మాలధారణ గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాలధారులకు పూజా పుస్తకం, పూజా సామగ్రి అందజేశారు.

బోధకుల కొరత.. చదువుకు వెత

- పాఠశాలల్లో కానరాని ఉపాధ్యాయులు
- చదువులకు దూరమవుతున్న చిన్నారులు
- నెలలు గడుస్తున్నా పట్టించుకోని యంత్రాంగం
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు



చిలకలవీధిలోని పాఠశాలలో ఉపాధ్యాయుడు లేక ఆరుబయట కూర్చున్న విద్యార్థులు



వాడమామిడి జీపీఎస్ పాఠశాల వద్ద విద్యార్థులతో తల్లిదండ్రులు

గూడెంకొత్తవీధి: విద్యార్థులను బడికెందుకు పంపుతారు...అక్కడ ఉపాధ్యాయులు చక్కగా చదువుతోపాటు విద్యాబుద్ధులు నేర్పుతారని.. మరి ఆ బడిలో ఉపాధ్యాయులే లేకపోతే ఇక ఆ విద్యార్థులకు పాఠాలెవరు బోధిస్తారు... వారి పరిస్థితి ఏమిటి... అల్లూరి జిల్లా గూడెంకొత్తవీధి మండలంలోని అనేక పంచాయతీల్లో ఈ పరిస్థితి ఉంది. ఇక్కడ మారుమూల గ్రామాల్లో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో జీపీఎస్ ప్రాథమిక పాఠశాలలున్నాయి. ఇక్కడ సీఆర్‌టీలుగా పనిచేసిన వారు రెగ్యులర్ కావడంతో వారంతా ఇతర పాఠశాలలకు బదిలీపై వెళ్లిపోయారు. దీంతో అప్పటివరకు సీఆర్‌టీలతో కొనసాగిన జీపీఎస్ పాఠశాలలకు ఉపాధ్యాయులు లేని పరిస్థితి ఏర్పడింది.

చిన్నారుల భవిష్యత్ ప్రశ్నార్థకం

గూడెం కొత్తవీధి మండలం తడకపల్లి, వాడమామిడి, కొమ్ములవాడ, చినఅగ్రహారంలలో జీపీఎస్ పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలల్లో ఉపాధ్యాయులు బదిలీ అయి మూడు నెలలు పైబడినా కూటమి ప్రభుత్వం నేటి వరకు ఎవరినీ ప్రత్యామ్నాయంగా నియమించలేదు. దీంతో ఇక్కడి పాఠశాలల్లో విద్యార్థులు ప్రాథమిక విద్యకు దూరమవుతున్నారు. తమ పిల్లల భవిష్యత్తు ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలోనూ వైఎస్సార్‌సీపీకి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అధికారులను నిలదీశారు. అయినా ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన లేదు. తాజాగా గూడెంకొత్తవీధి పంచాయతీ వాడమామిడి గ్రామంలోని జీపీఎస్ పాఠశాలలో 1 నుంచి 5 తరగతి వరకూ 15మంది విద్యార్థులున్నారు.

ఉపాధ్యాయులు లేకపోవడంతో తమ పిల్లలు చదువుకు దూరమవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పాఠశాలల్లో ఉపాధ్యాయులను నియమించాలని వారు కోరుతున్నారు. ఈ విషయంపై ఎంఈవో సత్యనారాయణ మాట్లాడుతూ డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయులను సర్దుబాటు చేసేందుకు వీలుగా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు.

సీలేరు: జి.కె.వీధి మండల దారకొండ పంచాయితీ చిలకలవీధి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు 10 మంది విద్యార్థులకు ఉపాధ్యాయుడు లేక చిన్నారులు చదువుకు దూరమవుతున్నారు. చిలకలవీధి పాఠశాలలో ఆరు నెలలు గడుస్తున్నా ఉపాధ్యాయుడు లేకపోవడం బాధాకరమని, ఇలా అయితే తమ పిల్లల చదువులెలా సాగుతాయని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ఉపాధ్యాయులను నియమించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని పలువురు గ్రామస్తులు ,గిరిజన సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాఠశాలకు ఉపాధ్యాయుడిని నియమించి పిల్లల చదువులు సాగేలా చూడాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం



అరకులోయలో దీక్ష చేస్తున్న ఆదివాసీ జేఏసీ నాయకులు



చింతపల్లిలోని మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు బాలయ్య

అరకులోయ రూరల్/గూడెం కొత్తవీధి/చింతపల్లి: గిరిజన ప్రాంతాల్లో జీవో నంబరు-3ను అమలు చేయాలని, గిరిజన చట్టాలు సక్రమంగా అమలుచేయాలని, గిరిజన నిరుద్యోగులకు స్పెషల్ డీఎస్సీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ జేఏసీ, సీపీఎం నాయకులు చేపట్టిన దీక్షలు బుధవారం నాటికి రెండోరోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆదివాసీ జేఏసీ, సీపీఎం నాయకులు మహదేవ్, ఆనంద్, చిన్నయ్యపడాల్, చింతపల్లి జడ్పీటీసీ బాలయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో విఫలం చెందిందన్నారు. గిరిజన చట్టాలు సక్రమంగా అమలుచేసి, ఏజెన్సీలో ఉద్యోగాల్లో గిరిజనులకు కేటాయించాలన్నారు. స్పెషల్ డీఎస్సీ ప్రకటించి గిరిజన నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలన్నారు. వివిధ సంఘాల నాయకులు బుద్దు, గోపాల్, సత్యనారాయణ, చంటిబాబు, బాలయ్య, కోటేశ్వరరావు, గంగరాజు, మోహన్, శశికుమార్, మత్యలింగం పాల్గొన్నారు.

డిపోలకు సరకుల సరఫరా

అడ్డతీగల: అడ్డతీగల జీసీసీ బ్రాంచి పరిధిలోని ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరకులు సరఫరా చేస్తున్నట్టు బ్రాంచి మేనేజర్ విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలకనుగుణంగా అడ్డతీగల ఎంఎల్‌ఎస్ పాయింట్(గొడౌన్) నుంచి బ్రాంచి పరిధిలోని అడ్డతీగల, గంగవరం, వై.రామవరం లోయర్ పార్టుల కిందకి వచ్చే 32 రేషన్ డిపోలకు బియ్యం, కందిపప్పు, పంచదార పూర్తిగా సరఫరా చేశామన్నారు. రేషన్ కార్డుదారులు ఈ విషయాన్ని గమనించి డీఆర్ డిపోల నుంచి ఆయా సరకులు తీసుకోవాలని సూచించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రంపచోడవరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ విద్యార్థులకు అగ్ని ప్రమాదాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్ని మాపక సిబ్బంది బుధవారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం జరిగినప్పుడు మంటలు వ్యాప్తి చెందకుండా ఎలా అదుపు చేయాలో వివరించారు. వినూత్నమైన ప్రయోగాలు చేసి విద్యార్థులకు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం.చినబాబు మాట్లాడుతూ ఫైర్ సేఫ్టీ గురించి, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలను వివరించారు. విద్యార్థులు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాల నివారణపై తెలుసుకున్న అంశాలను ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ఫైర్ సిబ్బంది గంగన్నదొర, రామచంద్రరావు, కళాశాల సిబ్బంది పోతురాజు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పూరిళ్లు దగ్ధం



కట్టుబట్టలతో మిగిలిన బాధితులు

కొయ్యూరు: మండలంలోని పాత బాలారంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా బుధవారం రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన నాగులపల్లి కొండబాబు, అర్జునకు చెందిన ఇళ్లు దగ్ధమవడంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. ఇంట్లోని వస్తువులన్నీ కాలి బూడిదనట్టు బాధితులు వాపోయారు. ఈ ప్రమాదంలో సుమారు లక్ష రూపాయల వరకు నష్టం జరిగిందని, సర్వం కోల్పోయామని కన్నీరుమున్నీరయ్యారు. ఈ ప్రమాద విషయాన్ని తెలుసుకొని సర్పంచ్ అప్పన అప్పలనర్స తన సొంత నిధులు రూ.10 వేలను బాధిత కుటుంబాలకు అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. ప్రభుత్వ పరంగా సాయాన్ని అందేలా చూస్తానని ఆయన బాధితులకు హామీ ఇచ్చారు. ఈ సంఘటనపై తహసీల్దార్ ఎల్.వి.ప్రసాద్‌కు సమాచారం అందించినట్టు తెలిపారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



చింతూరులో అక్బర్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి



తోటపల్లిలో సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

చింతూరు: మండల కో-ఆప్షన్ సభ్యుడు వైఎస్సార్‌సీపీ నాయకుడు మహ్మద్ అక్బర్‌అలీ మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్సీ అనంత ఉదయ్ భాస్కర్, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన అక్బర్ కుటుంబ సభ్యులను వారు బుధవారం రాత్రి పరామర్శించారు. వారు మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం అక్బర్ చేసిన సేవలు మరువలేనివని ప్రశంసించారు. జెడ్పీటీసీ సభ్యుడు చిచ్చడి మురళి, ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీ మేడేపల్లి సుధాకర్, సర్పంచ్ కారం కన్నారావు, పార్టీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, మడివి రాజు, కరీముల్లా పాల్గొన్నారు.

ఎటపాక: తోటపల్లి సర్పంచ్ మోసం దుర్గలక్ష్మి కుటుంబాన్ని ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి బుధవారం పరామర్శించారు. సర్పంచ్ భర్త, పార్టీ సీనియర్ నాయకుడు మోసం కన్న తండ్రి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. వారి స్వగ్రామం కుసుమనపల్లి వెళ్లి సర్పంచ్ కుటుంబాన్ని వారు కలిసి ఓదార్చి ధైర్యం చెప్పారు. ఎంపీటీసీ అంజలి, పార్టీ నాయకులు వెంకటరామారావు, వెంకట్, అప్పలరెడ్డి, వెంకటేశ్వర్లు, మణి, శశికుమార్, సత్యనారాయణ తదితరులున్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని వినతి

రాజవొమ్మంగి: వేతన బకాయిలు చెల్లించాలని కోరుతూ 104 సిబ్బంది మండల కేంద్రంలోని పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సుష్మ, సరోజ్ ముఖర్జీలకు బుధవారం వినతిపత్రం అందజేశారు. మూడు నెలలుగా జీతాలు లేక ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం స్పందించి వేతనాలు మంజూరు చేయాలని కోరారు. పీఎఫ్ చెల్లింపుతో పాటు బీమా సదుపాయం కల్పించాలని వినతిలో పేర్కొన్నారు. సిబ్బంది శ్రీనివాసరావు, కనకరాజు తదితరులున్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



రచ్చబండ వేదికను ప్రారంభిస్తున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయ రూరల్: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. మండలంలో పద్మాపురం పంచాయతీ కేంద్రంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3లక్షలతో నిర్మించిన రచ్చబండ వేదికను అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులు సమావేశాలు, ఇతరత్రా కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు ఈ వేదిక ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గ్రామస్తుల సౌకర్యార్థం నిర్మించిన రచ్చబండ వేదికను అందరూ ఉపయోగించుకోవాలన్నారు. సర్పంచ్ సుస్మిత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు కుమారి, వైఎస్సార్‌సీపీ నాయకులు అశోక్‌కుమార్, సుంక్ర, రామ్మూర్తి, అర్జున్, రాజ్‌కుమార్, సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మత్స్యగుండం అభివృద్ధికి వినతి



ఐటీడీఏ పీఓ అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్‌కు వినతిపత్రం అందజేస్తున్న మత్స్యగుండం ఆలయ కమిటీ ప్రతినిధులు

పాడేరు : ఏజెన్సీలో ప్రముఖ శైవక్షేత్రమైన మత్స్యగుండం ఆలయం అభివృద్ధికి అన్ని రకాల చర్యలు తీసుకోవాలని మఠం పంచాయతీ సర్పంచ్ మఠం శాంతికుమారి, మత్స్యగుండం ఆలయ కమిటీ ప్రతినిధులు పాంగి మత్స్యకొండబాబు, మినుముల గోపాలపాత్రుడు కోరారు. ఈ మేరకు వారు బుధవారం ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. శైవక్షేత్రంతో పాటు ప్రముఖ పర్యాటక ప్రాంతం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు, పర్యాటకులు వస్తుంటారని, ఈ మేరకు ఇక్కడ ఉద్యానవనం, పార్కు ఏర్పాటుతో పాటు, మరుగుదొడ్లు, తాగునీరు తదితర సౌకర్యాలను కల్పించాలని కోరారు. మఠం జంక్షన్ నుంచి మత్స్యగుండం వరకు రోడ్డు విస్తరణ పనులు చేపడుతామని, మిగిలిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆయా అధికారులు హామీ ఇచ్చినట్టు వారు తెలిపారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



సున్నంపాడు సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస విశ్వనాథ్

మారేడుమిల్లి/అడ్డతీగల/గంగవరం: ఎమ్మెల్సీ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉందని, అందరూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిబంధనలు పాటించాలని జిల్లాలోని అధికారులు బుధవారం సిబ్బందికి సూచించారు. ఇందులో భాగంగా మారేడుమిల్లి, ఎంపీడీవో టి.శ్రీనివాస విశ్వనాథ్, అడ్డతీగల ఇన్‌చార్జి తహసీల్దార్ సీహెచ్.శ్రీనివాసరావు, గంగవరం తహసీల్దార్ శ్రీనివాసరావు తదితరులు ఆయా ప్రాంతాల్లో సిబ్బందితో మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ కఠినంగా అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ, సచివాలయం సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నికల నియమావళి అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. రాజకీయ పార్టీ, నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాలు, ఎన్నికల కోడ్ అమలుకు సహకరించాలని కోరారు.

గ్రామాల్లో రోడ్డు పనులు ప్రారంభం



ఆగంపాడులో రోడ్డు పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి



జంగిడివలసలో పనులను ప్రారంభిస్తున్న నాయకులు



జంగంసరియాలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ నరసింగరావు, ఎంపీటీసీ సుబ్బలక్ష్మి, నేతలు

పెదబయలు: మండలంలోని కొరవంగి పంచాయతీ కేంద్రంలో రూ.5లక్షల జెడ్పీ నిధులతో సీసీ చేపట్టనున్న రోడ్డు పనులను జెడ్పీటీసీ సభ్యుడు కూడ బొంజుబాబు, మాజీ ఎంపీపీ సల్లంగి ఉమామహేశ్వరరావు బుధవారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏజెన్సీలోని గ్రామాల్లో రహదారులు మౌలిక సదుపాయాల కోసం కోట్లాది రూపాయలు మంజూరు చేసినట్టు తెలిపారు. గ్రామాల్లో సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ యువత అన్ని రంగాల్లో రాణించాలన్నారు. గ్రామాల్లో దీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కానికి స్థానికులు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పనులు చేయించుకోవాలన్నారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కాతారి సురేష్‌కుమార్. సర్పంచ్ పోయిభ బాలయ్యదొర, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సందడి ఆనందరావు, మాజీ ఎంపీటీసీ మాధవరావు, బాలరాజు, బొంజుబాబు, దేవి, శంకర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: మండలంలోని భీరం పంచాయతీ ఆగంపాడు గ్రామంలో జెడ్పీ నిధులు రూ.5లక్షలతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణ పనులను జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సదుపాయం, డ్రైనేజీ, వంటి సదుపాయాలు కల్పించినట్టు చెప్పారు. అభివృద్ధి పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్నబాబు ఆచారి, లక్ష్మీ, నర్సింహమూర్తి, ప్రకాష్ తదితరలు పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: మండలంలోని కురిడి పంచాయతీ నరింజవలస నుంచి పాత జంగిడివలసలో రహదారి పనులకు సర్పంచ్ కొర్ర లచ్చు, ఎంపీటీసీ సభ్యురాలు రాజేశ్వరి, మాజీ ఎంపీటీసీ మహాదేవ్ బుధవారం శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చొరవతో మంజూరైన నిధులతో పనులు చేస్తున్నట్టు తెలిపారు. ఇంజినీరింగ్ సిబ్బంది సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని ఏనుగురాయి పంచాయతీ జంగంసరియా గ్రామంలో సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ నరసింగరావు, ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. వార్డు సభ్యుడు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ బలోపేతానికి కృషి

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో బుధవారం యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం జరిగింది. కమిటీ అధ్యక్షుడిగా సమరెడ్డి రాజు, ప్రధాన కార్యదర్శిగా సీసా గోపిలు ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షుడిగా ఎం.అప్పలనాయుడు, సహాధ్యక్షులుగా త్రినాథం, పి.ఈశ్వరమ్మ, కోశాధికారిగా శ్రీనివాసమూర్తి, కార్యదర్శులుగా కృష్ణ, దాసయ్య, అవినాష్, దీప్తి, సురేష్‌కుమార్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్ష,కార్యదర్శులు రాజు, గోపిలు మాట్లాడుతూ యూటీఎఫ్ బలోపేతానికి కృషి చేయడంతో పాటు ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. జిల్లా జనరల్ సెక్రటరీ వి.మహేశ్వరరావు పరిశీలకుడిగా, జిల్లా కార్యదర్శులు ధర్మారావు, రఘునాథ్‌ల పర్యవేక్షణలో ఎన్నిక జరిగింది.

సీజనల్ వ్యాధులపై అవగాహన



మాట్లాడుతున్న వైద్యాధికారి రమేష్

ముంచంగిపుట్టు: మండలంలోని కిలగాడ పీహెచ్‌సీలో బుధవారం 9 గ్రామ సచివాలయాల పరిధిలోని ఆశా కార్యకర్తలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఆయుష్మాన్ మిషన్ ద్వారా వివిధ రకాల వ్యాధులపై అవగాహన కల్పించారు. రోగులకు అందించే ప్రాథమిక వైద్యంపై తెలియజేసి, పలు సూచనలు చేశారు. కిలగాడ, లబ్బూరు వైద్యాధికారులు రమేష్, ప్రతాప్, ఆయుష్మాన్ మిషన్ వైద్యాధికారి త్యాగరాజు,హెల్త్ సూపర్‌వైజర్లు కృష్ణవేణి, వేదవతి, ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యంలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్





డుంబ్రిగుడ, కొయ్యూరులో అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న వీవోఏలు



అరకులోయలో దీక్షలు చేస్తున్న వీవోఏలు

అరకులోయ రూరల్/డుంబ్రిగుడ/ముంచంగిపుట్టు/జి.మాడుగుల/కొయ్యూరు: జిల్లా వ్యాప్తంగా వెలుగు శాఖ వీవోఏలు బుధవారం నిరసన దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా వీవోఏల సంఘం నాయకులు తదితరులు మాట్లాడుతూ వీవోఏలకు మూడేళ్ల కాల పరిమితి విధానం రద్దు చేయాలని, ఆరు నెలల బకాయి వేతనాలు తక్షణమే చెల్లించాలని, తొలగించిన వారికి తిరిగి విధుల్లో చేర్చుకోవాలని, ఉద్యోగ భద్రత పాటించాలని, ఉన్నతాధికారులు వేధింపులు ఆపాలన్నారు, అన్ని రకాల ప్రభుత్వ సౌకార్యాలు కల్పించాలని కోరారు. కూటమి ప్రభుత్వం త్వరితగతిన స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని లేని పక్షంలో ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ర్యాలీలు నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను ఏపీఎంలు, ఇతర అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. సీఐటీయూ, తదితర సంఘాలు వీవోఏల దీక్షకు మద్దతు తెలిపాయి. నాయకులు రాజ్‌కుమార్, జ్యోతి, మధు, ఆనంద్, పోతురాజు, భాస్కర్‌రావు, బాలకృష్ణ శంకర్‌రావు, భీమరాజు, త్రినాథ్, రాజారావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో సీపీఎం నాయకుల సమావేశం బుధవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ పీఎం జన్‌మన్ గృహాల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న రూ.2.39లక్షలు సరిపోవని రూ.5లక్షలు కేటాయించాలని డిమాండ్ చేశారు. మండలంలో పీఎం జన్‌మన్ పథకం సక్రమంగా అమలు కావడం లేదని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలని, గిరిజన చట్టాలు సక్రమంగా అమలుచేయాలన్నారు. నేతలు భీమరాజు, త్రినాథ్, శ్రీను, నారాయణ, శంకర్, లైకోన్ తదితరులు పాల్గొన్నారు.